
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో 12 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 15వేల మంది రైతులు ఈ సంఘం ద్వారా పంట రుణాలు అందుకుంటున్నారు. గత వైసీపీ పాలనలో తెచ్చిన నిబంధనలతో సున్నా వడ్డీ పథకం కింద కేవలం వేయి మంది కూడా అర్హులు కాలేదు. రైతులే ముందుగా వడ్డీ చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం నిధుల లభ్యతను బట్టి ఆ రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందనే నిబంధన తీసుకురావడంతో సంఘం పరిధిలోని రైతులు నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. మరో వైపు పొలాలను అభివృద్ధి చేసుకునేందుకు పాడిగేదెలు, పొట్టేళ్ల పెంపకంతో తమ జీవనాన్ని మెరుగుపరుచుకునేందుకు అమలు చేసిన సున్నా వడ్డీ పథకాన్ని పూర్తిగా ఎత్తి వేయడంతో ఈ సంఘం కార్యకలాపాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి.

● కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)



కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం



ఆ పథకాలేమయ్యాయి?

- సున్నా.. పావలా వడ్డీ పథకాలపై అయోమయం
- ముందు రైతులు చెల్లించాలనే షరతుతో పథకాలకు దూరం
- ఈ-క్రాప్‌తో చిక్కులు
- గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం వెళ్తోందా?



చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఎల్లన్న మార్చి నెలాఖరులో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించాడు. రెండు సంవత్సరాలైనా ఇతనికి ప్రభుత్వం నుంచి ఈ వడ్డీకి సంబంధించిన మొత్తం బ్యాంకు ఖాతాకు జమ కాలేదు. కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. తమ చేతిలో ఏమీ లేదని ప్రభుత్వం సున్నా వడ్డీ మొత్తాన్ని ఎప్పుడు మీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందో తమకు తెలీదని ముఖం మీదనే అధికారులు చెప్పారు.



పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, డోన్, పాణ్యం నియోజకవర్గాల్లో రైతులు ఖరీఫ్ పంట సాగు పూర్తి కాగానే కుటుంబ జీవనం కోసం వలస బాట పడుతున్నారు. రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను మరింతగా మెరుగులు దిద్ది ఎక్కువ మంది ప్రయోజనం అందుకునేలా చర్యలు చేపట్టాల్సిన పాలకులు లబ్ధిదారుల వడపోత కోసం సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో 12 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది ప్రధాన పంటలను, కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ రైతులు పంట సాగు చేయడానికి సున్నావడ్డీ, పావలా వడ్డీ పథకాలను ప్రభుత్వాలు ఎప్పటి నుంచో అమలు చేస్తున్నాయి.

సున్నా వడ్డీ పథకంపై నీలి నీడలు

గతంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంట సాగు కోసం తీసుకుంటున్న పంట రుణాలపై ఏడు శాతం వడ్డీని మాత్రమే వసూలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఆ తర్వాత క్రమంగా ఈ వడ్డీని కూడా పేద రైతులకు కట్టాల్సిన అవసరం లేకుండా సున్నావడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ సున్నా వడ్డీ పథకం నిబంధనలను మార్చేయడంతో రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదు. ఆ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు మొదట తాము తీసుకున్న పంట రుణంపై బ్యాంకులకు వడ్డీ చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం నిధుల అందుబాటును బట్టి రైతులు చెల్లించిన వడ్డీని తిరిగి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో తీసుకున్న పంట రుణంపై ఎంత వడ్డీ చెల్లించాలో ఆ వడ్డీని రైతులు ఆ సంవత్సరం మార్చి 31లోపు చెల్లించాలి. ఉదాహరణకు ఖరీఫ్‌లో పంట రుణం తీసుకున్న రైతు ఆ సంవత్సరం మార్చి నెలాఖరులోగా వడ్డీ చెల్లించాలి. గడువులోగా చెల్లించని రైతులకు సున్నా వడ్డీ పథకం వర్తించదు. అదే విధంగా రైతులు సాగు చేసిన పంటను ఖచ్చితంగా ఈక్రాప్‌లో నమోదు చేయించాలి. అయితే.. బ్యాంకుల్లో, సహకార సంఘాల్లో రైతులు తాము వాస్తవంగా సాగు చేసిన పంటను కాకుండా వేరే పంట సాగు చేసినట్లు ఈక్రాప్‌లో నమోదు చేయిస్తున్నారు. ఏ పంటకైతే ఎక్కువ రుణం వస్తుందో ఆ పంటనే తాము సాగు చేసినట్లు బ్యాంకులు, సహకార సంఘాల్లో నమోదు చేయిస్తున్నారు. అయితే.. రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టే సమయంలో ఏ పొలంలో ఏ పంట సాగు చేశారో ఆ పంటనే అధికారులు నమోదు చేస్తున్నారు. దీని వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడుతున్నది. వాస్తవంగా సాగు చేసిన పంట ఒకటైతే.. రుణం తీసుకున్న బ్యాంకులు, సహకార సంఘాల్లో నమోదైన పంట వేరేగా ఉండటంతో ఆ రైతులకు సున్నావడ్డీ పథకం వర్తించడం లేదు. మొదట ఈ సున్నావడ్డీ పథకం అమలైన సమయంలో రైతులే వడ్డీ చెల్లించాలి.. ఈక్రాప్ జాబితాలో ఏ పంట నమోదైతేనే.. ఆ పంటకే సున్నా వడ్డీ వర్తిస్తుందని నిబంధనలు ఉండేవి కావు.. దీనివల్ల ప్రస్తుతం సున్నా వడ్డీ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో పంటలు సాగు చేస్తున్న పేద రైతులు నాలుగున్నర లక్షల మంది ఉంటే.. కేవలం వేల సంఖ్యలో రైతులకు మాత్రమే సున్నావడ్డీ పథకం అమలవుతుంది.

ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేస్తాం



గత వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకంపై ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చిన వెంటనే సున్నా వడ్డీ పథకం అమలుపై చర్యలు తీసుకుంటాం.

●వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ



పావలా వడ్డీని పునరుద్ధరించాలని డిమాండ్

గతంలో పావలా వడ్డీ పథకాన్ని అమలు చేసినట్లే ఇప్పుడు కూడా అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు. గతంలో రూ. 3 లక్షల రుణం తీసుకున్న రైతులకు ఈ పథకం వర్తించేది. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసింది. సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నామని ఈ పథకాన్ని మాయం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా పావలా వడ్డీ పథకాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు సున్నావడ్డీ పథకంపై ఇంకా ఎటువంటి మార్పులు, చేర్పులు చేయకపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సున్నావడ్డీ పథకంతో పాటు పావలా వడ్డీ పథకాన్ని కూడా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సున్నా వడ్డీ పథకం వర్తింపజేయాలి



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీ పథకం అరకొరగానే అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల మంది పంట రుణాలు తీసుకుంటే కేవలం వేల సంఖ్యలోనే రైతులను లబ్ధిదారులుగా చేర్చారు. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. అలాగే పావలా వడ్డీ పథకాన్ని కూడా పునరుద్ధరించాలి

● రామకృష్ణ, రైతు సంఘం నాయకుడు

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు భూమిని గుర్తించండి

● అధికారులకు మంత్రి టీజీ భరత్ ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తగిన భూమిని గుర్తించాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు భూమి గుర్తింపు అంశంపై సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మంత్రి టీజీ భరత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. సమావేశంలో కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

వేరుశనగ ధర పతనం

- కేంద్రం నిర్ణయించిన ధర క్వింటం రూ.7,263
- కర్నూలు యార్డులో 4,958 నుంచి రూ.6,786
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లీల ధర పతనమైంది. కేంద్రం క్వింటంకు రూ.7,263 మద్దతు ధరగా ప్రకటించింది. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వివిధ ప్రాంతాల నుంచి 139క్వింటాళ్ల వేరుశనగ కాయలను రైతులు అమ్మకానికి తెచ్చారు. కనిష్ఠ ధర రూ.1000, మధ్యస్తం రూ.4,958, గరిష్ఠ ధర రూ.6,786 మాత్రమే రైతుకు దక్కింది. రైతులకు మద్దతు ధర దక్కకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పంట ఉత్పత్తులకు కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అందలేదు. మొక్కజొన్నలకు మద్దతు ధర రూ.2,400 కాగా, కనిష్ఠం రూ.1,439 మధ్యస్థ రూ.1,749, గరిష్ఠం రూ.1,792 మాత్రమే దక్కింది.



అమ్మకానికి తెచ్చిన వేరుశనగ కాయల నిల్వలు

నిర్ణీత గడువులోగా పరిష్కరించండి

● ఎస్పీ సునీల్ షెరాన్ ● పీజీఆర్‌ఎస్‌కు 111 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే సమస్యలను చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలి అధికారులను ఆదేశించారు. అర్జీదారుల నుంచి 111 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి ఎందుకు వస్తున్నారని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తన కుమార్తెకు నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చంద్రశేఖర్, అన్వర్ రూ.3లక్షలు డబ్బులు వసూలు చేశారని పర్వతం శేషన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆత్మకూరులో ఇందిరానగర్ చర్చి పాస్టర్ సమాయేలు రూ.15లక్షలు తీసుకుని అందుకుగాను రూ.10లక్షలకు బాండు రాసి మిగిలిన వాటికి రాసి ఇవ్వకుండా మోసం చేశాడని శ్రీపతిరావుపేటకు చెందిన తిరపతయ్య ఎస్పీకి అర్జీ అందజేశారు. సీఐ మోహన్‌రెడ్డి పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● టైగర్ ప్రాజెక్ట్ సర్కిల్ కన్జర్వేటర్ విజయ్‌కుమార్



నివాళి అర్పిస్తున్న కన్జర్వేటర్ విజయ్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సిబ్బంది విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని టైగర్ ప్రాజెక్ట్ సర్కిల్ కన్జర్వేటర్ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం నంద్యాలలోని రీజినల్ కార్యాలయంలో అటవీ అమరవీరుల దినోత్సవంలో ఆయన పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అటవీ సంరక్షణలో, వన్యప్రాణులు, ఎర్రచందనం కాపాడడంలో 19మంది అటవీ అధికారులు, ఐదుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రాణాలను అర్పించారన్నారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బందికి ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకరావాలన్నారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యులను చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, రేజింగ్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

కలెక్టర్ రాజకుమారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 10 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీఓపెన్ అయిన దరఖాస్తులను సక్రమంగా, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లను నాణ్యంగా రూపొందించాలన్నారు. ఇప్పటి వరకు 580 రీ ఓపెన్ దరఖాస్తులు నమోదు కాగా వాటిలో ఎక్కువ శాతం బండిఆత్మకూరు, పాణ్యం, నంద్యాల, కొత్తపల్లి, రుద్రవరం, డోన్, గడివేముల, బనగానపల్లి తహసీల్దారు, ఆత్మకూరు, నంద్యాల ఆర్డీవో కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వీటన్నింటినీ వారం రోజుల్లో క్లియర్ చేయాలని ఆదేశించారు. ఇంకా 56 అర్జీలను సంబంధిత తహసీల్దార్లు తమ లాగిన్‌లో చూసుకోలేదని.. ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వీఐపీ గ్రీవెన్స్‌లకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టాప్ ఫైవ్‌లో ఉంచండి

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలోనూ నంద్యాల జిల్లాను టాప్ ఫైవ్‌లో ఉంచేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాల అమలులో డేటా ఆధారిత పాలన కీలక పాత్ర పోషిస్తుందని , అందుకు అనుగుణంగా ప్రతి అధికారి తమ పనితీరును మెరుగుపరుచుకొని చురుకుగా పనిచేయాలన్నారు. ప్రతి నెల మండల స్థాయిలో 5వతేదీలోగా, జిల్లా స్థాయిలో 8వ తేదీలోగా సంబంధిత శాఖలు డేటాను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో కార్తీక శోభ

- కృష్ణమ్మ ఒడిలో పుణ్యస్నానాలు, దీప దానాలు
- ఆది దంపతులకు లక్ష దీపోత్సవం
- పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠమైన శ్రీశైల పుణ్యక్షేత్రం కార్తీక శోభతో కళకళలాడుతోంది. కార్తీకమాసం సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలను చేసుకొని కృష్ణమ్మకు దీపాలను వెలిగించి పసుపు కుంకుమలతో సారెను సమర్పించారు. పరమశివుని దర్శించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు క్యూలైన్‌ల్లో బారులు దీరారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. కార్తీక మాసాంతం శని, ఆది, సోమవారాలతోపాటు ప్రభుత్వ సెలవు రోజులు భక్తులందరికీ అలంకార దర్శనం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు అన్నారు. అదేవిధంగా మాసాంతం గర్భాలయ అభిషేకాలు, సామూహికాభిషేకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. క్యూలైన్‌లో వేచి ఉండే యాత్రికులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు అందిస్తున్నట్లు ఆలయ పీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు.



పుష్కరిణికి హారతిలో పాల్గొన్న భక్తులు

లక్ష దీపోత్సవం.. పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలంలో సోమవారం సాయంకాలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవంగా పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వేదికపై పూజా క్రతువులు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లతోపాటు పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు, ఆలయ పీఆర్‌వో శ్రీనివాసరావు, ఈఈ నర్సింహరెడ్డి, డీఈ శాస్త్రి, ఏఈఈలు పాల్గొన్నారు.



హారతి ఇస్తున్న అర్చకులు

పాఠశాల తనిఖీ

పాణ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సంగ్రహణాత్మక మూల్యాంకనం-1ని పరిశీలించారు. విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, రోజూ వివిధ సబ్జెక్టును చదివేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. సోమవారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 12,093 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 2,264 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 35,852 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 22,792 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35,315 మొత్తంగా 58,107 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. జలాశయంలో నీటిమట్టం 883.60 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలకుగాను 207.84 టీఎంసీలుగా ఉన్నాయి.

మద్దతు ధర లేని మొక్కజొన్న 6
● కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూపు

రైతులకు అండగా ఉంటాం
● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు 7



జల సంపదలో పశు సంపద

సుంకేసుల జలాశయం నిండు కుండలా ఉంది. జల సిరితో శోభాయమానంగా కనిపిస్తోంది. అధికారులు మూడు గేట్లను సోమవారం ఎత్తేశారు. జలాశయానికి అవతలి వైపు ఉన్న రాజోలి నుంచి వచ్చిన పశువులు నీటిలో ఈదుకుంటూ వెళ్లాయి. పశువులను మేపు కోడానికి వచ్చిన వారు నీటి ఉధృతిని దాటడానికి వాటి తోకలు పట్టుకొని ఈదుకుంటూ వెళ్లారు. ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.

– ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఐఐఐటీడీఎం, ఆర్‌యూ మధ్య ఎంవోయూ



ఒప్పందం పత్రంపై సంతకం చేసిన ఐఐఐటీ డీఎం ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఆర్‌యూ వైస్ చాన్సలర్ బసవరావు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎం, రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) విద్యాసంస్థల మధ్య విద్య, పరిశోధన సహకారానికి సంబంధించి ఎంవోయూ ఒప్పందంపై అధికారులు సంతకాలు చేశారు. ఐఐఐటీ డీఎం డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి, ఆర్‌యూ వీసీ బసవరావు సోమవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన పాఠ్యాంశాల అభివృద్ధి, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్, ఎలక్ట్రిక్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఆవిష్కరణల చొరవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది. స్టార్టప్ ఇంక్యుబేషన్‌కు మద్దతు ఇవ్వడానికి వర్క్‌షాపులు, సమావేశాలు నిర్వహించడానికి ఉమ్మడి పరిశోధనలకు అవసరమైన నిధులు కోరడానికి కూడా రెండు సంవత్సరాలు కలిసి పని చేస్తాయి. ఈ అవగాహన ఒప్పందం రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు
- కర్నూలులో బస్సు జాతా ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు పెండింగ్ ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి. వలరాజు, నాసర్ జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ఏ. క్యాంపులోని హార్ట్ అండ్ బ్రెయిన్ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని ఆరోపించారు. నారా లోకేశ్ విద్యామంత్రిగా వంద శాతం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల్లోని సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవో.నెం.77ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మస్తాన్, ఫణీంద్ర, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయండి: ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం లేకుండా నిబద్ధతతో పని చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నంద్యాల, ఆళ్లగడ్డ యూనిట్‌లో పనిచేస్తూ జాఫర్‌వలి, ఖాజాపీర్ అనారోగ్యంతో చనిపోయారు. వారి కుటుంబ సభ్యులకు హోంగార్డులుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఖాజాపీర్ భార్య జహీరబీ, జాఫర్ వలి భార్య తయాబాబేగంకు హోంగార్డులుగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. వారి వారి యూనిట్లలో నిజాయితీగా పనిచేసి మంచిపేరు తీసుకురావాలన్నారు.

కార్తీక సందడి



యాగంటిలో కార్తీక సోమవారం సందర్భంగా స్నానమాచరిస్తున్న భక్తులు

ఉమా మహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో కార్తీక మూడో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం ఉమామహేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన సహస్రనామావళి, ప్రసాద వితరణ, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం పుష్కరిణి వద్ద స్నానమాచరించారు. యాగంటి బసవయ్య, ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఓంకార నామస్మరణతో మార్మోగింది. యాగంటి బసవయ్యను, ఉమామహేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేంకటేశ్వరగవి వద్ద వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ మేనేజరు పాండురంగారెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ మాళీశ్వరరెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూలైన్‌లోనే తాగునీటి వసతి కల్పించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉమామహేశ్వర నిత్యాన్నసంస్థ, ఉమామహేశ్వరరెడ్డి అన్నదాన సంస్థ, ఉమామహేశ్వర ఆర్యవైశ్య అన్నదాన సంస్థలో భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. పసుపుల గ్రామ సమీపంలోని గుండం మల్లికార్జున స్వామి, పలుకూరులోని రామేశ్వరస్వామి, రామతీర్థంలో వెలసిన బుగ్గరామేశ్వర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



యాగంటిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మహానందికి పోటెత్తిన భక్తులు

- పాలు, బిస్కెట్ల పంపిణీ
- వైభవంగా జల హారతి

మహానంది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం మహానంది క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మహానందీశ్వరుని దర్శనం కోసం ఆది వారం రాత్రే తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి క్షేత్రానికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామునే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలచరించారు. ఆలయంలో అర్చకులు పూజలతో పాటు స్వామి, అమ్మవార్లకు నిర్వహించే మహామంగళ హారతి సేవలను జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. దాతల సహకారంతో దర్శనం తర్వాత భక్తులకు ఉచితంగా పాలు, బిస్కెట్లను ఈవో పంపిణీ చేశారు. దేవస్థానానికిరూ.12లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రాత్రి ఆలయం రెండవ ప్రాకారంలోని కోనేర్లకు ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా జల హారతి ఇచ్చారు. గంగాదేవికి వేదమంత్రాలతో ఈవో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ముందు భాగంలో నిర్వహించిన కోలాట నృత్యం పలువురిని ఆకట్టుకుంది.



మహానంది ఆలయం క్యూ లైన్లలో భక్తులు

అభివృద్ధికి నోచుకోని పశ్చిమ ప్రాంతం

- పాలకుల నిర్లక్ష్యంతో ఎడారిగా మారుతున్న వైనం
- ప్రభుత్వంపై సీపీఎం మాజీ ఎమ్మెల్యే గఫూర్ మండిపాటు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పాలకవర్గాల నిర్లక్ష్యం, నిరాదరణకు గురై అభివృద్ధికి దూరంగా, నిత్య వలసల కేంద్రంగా మారిపోయిందని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ. గఫూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్న పాలకుల తీరును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు పాదయాత్రలు నిర్వహించి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులుగా ఎందరో ఉన్నత పదవులను అనుభవించినా జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. వందల టీఎంసీల కృష్ణా జలాలు ఈ మండలాల మీదుగా వృథాగా సముద్రంలోకి పోతున్నా, వాటిని ఒడిసి పట్టుకుని తాగునీరు, సాగునీటికి వినియోగించుకునే భాగ్యం ఈ ప్రాంత ప్రజలకు కలగడం లేదన్నారు. ఆదోని, ఆలూరు, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, ఆస్పరి మండలాల ప్రజలు కేవలం ప్రకృతి దయా దాక్షిణ్యాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ నిత్యం అనావృష్టితో బతుకుతున్నారన్నారు. గత 50 ఏళ్లుగా ప్రజలు అడుగుతున్న వేదవతి ప్రాజెక్టు, నగరడోన రిజర్వాయర్, తుంగభద్ర నది ద్వారా వరద కాలువ, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదన్నారు. వ్యవసాయ ఆధారిత ఉల్లి, టమాటా, ఖనిజ ఆధారిత పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేతలు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, నారాయణ, అంజిబాబు, లింగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

అందెశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు

- అరుణ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహితి శిఖరం ప్రజాకవి అందెశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు అని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని రగిల్చిన గొప్ప కలం యోధుడు అని కొనియాడారు. నిత్యం పేదల పక్షాన గొంతుకను వినిపించిన నిస్వార్థపరుడు అన్నారు. తెలంగాణ మట్టి మనిషి అందెశ్రీ అన్నారు. అందెశ్రీతో తనకు వ్యక్తిగతంగా కూడా మంచి పరిచయం ఉందన్నారు. అందెశ్రీ భౌతికంగా మనమధ్య లేకపోయినా తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన జయజయహే తెలంగాణాజననీ జయకేతనం గేయం, ఆయన రచనలు, సాహిత్యం నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటాయన్నారు. ఆయన ఆత్మకు చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ఆర్ఐవో లాలెప్ప



మాట్లాడుతున్న ఆర్ఐవో లాలెప్ప

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆర్ఐవో జి. లాలెప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్టాంటన్‌పురంలో కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభుచరణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లాలెప్ప మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా సేవా దృక్పథంతో పాటు జాతీ య సమైక్యతను అలవర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడంతో వారిలో సృజనాత్మకత పెరిగి సమాజంలో తమ బాధ్యతలు తెలుసుకుంటారన్నారు. ఈ క్యాంపు పరిసరాల్లో సేవా కార్యక్రమాలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ఎన్ఎస్ఎస్ పీవో రేష్మా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభం

- ఏపీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల నుంచి హాజరైన 1700 మంది బీటెక్ ఫైనలియర్ విద్యార్థినులు



పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థినులు

పాణ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పూల్ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం ఇదే ప్రథమమని తెలిపారు. రాయలసీమ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి 1700 మంది విద్యార్థినులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థినులకు మౌఖిక రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక వేతనం రూ. 3.6 లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికలో పాల్గొన్న విద్యార్థినులకు కళాశాల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు తమ లక్ష్య సాధనలో ముందుండాలని ఇన్ఫోసిస్ ప్రతినిధి హర్షదీప్ పత్ర భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ రాష్ట్ర ఇన్‌చార్జి సత్యరత్నం, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, కళాశాల ప్రాంగణ అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, పాల్గొన్నారు.

మద్దతు ధర లేని మొక్కజొన్న

- కుదేలవుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూపు



తడిసిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు

కొలిమిగుండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించే రైతులను అడుగడుగునా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు ప్రభుత్వ సహకారం కూడా కరువై ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో విస్తారంగా సాగు చేసిన మొక్క జొన్నకు మద్దతు ధర కరువైంది. సాగు చేసిన దగ్గర నుండి చీడపీడలు, భారీ వర్షాల నుండి తీవ్ర కష్టాలను ఎదుర్కొని పండించిన పంటకు చివరకు సరైన ధరలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో క్వింటం రూ.3000, 3500 వరకు పలికిన మొక్క జొన్న ప్రస్తుతం రూ.1500, 1700 మించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ఆరంభమైనప్పుడు రూ.2100 పలికిన మొక్క జొన్న ధర రోజు రోజుకూ పడిపోతోంది. ఒక్కసారిగా రూ.1500 పడిపోవడంతో అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 64వేల ఎకరాల్లో మొక్క జొన్న సాగైంది. ప్రధానంగా కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర డివిజన్లలో మొక్క జొన్న అధికంగా సాగు చేశారు. మరోవైపు ఇటీవల ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ వల్ల మొక్క జొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 10,800 ఎకరాల్లో మొక్క జొన్న పంటకు నష్టం కలిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా బనగానపల్లె నియోజకవర్గంలోనే 8వేల ఎకరాల్లో మొక్క జొన్న దెబ్బతినడంతో రైతుల ఆవేదనకు అంతు లేకుండా పోయింది. తడిసిన ధాన్యంతో పాటు, ఇతర దిగుబడిని మార్కెట్లో అమ్ముదామంటే గిట్టుబాటు ధర లేదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రకృతి ప్రకోపంతో నష్టపోయిన అన్నదాతలకు గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో కష్టాలు తప్పడంలేదు.

కనిపించని కొనుగోలు కేంద్రాలు: ప్రభుత్వం రూ.2400 మద్దతు ధరలతో మొక్క జొన్న కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే అది నేటికీ కార్యరూపం దాల్చక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్క జొన్న కొనుగోలు కేంద్రాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నా, తడిసిన ధాన్యం ఎక్కువ రోజులు ఉంచుకునే పరిస్థితి లేక రైతులు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర రూ.3000 అందించాలి: మొక్క జొన్న సాగుచేసి తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.3000 చెల్లించాలని రైతులు కోరుతున్నారు. మొక్క జొన్న నూర్పిడి చేసిన రైతులు ధాన్యం తడిసి నష్టపోగా, నూర్పిడి చేయని రైతులు కూడా పంట నష్టపోయారు. కంకులు నల్లగా మారి, మొక్క జొన్న నాణ్యతలేమిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



రైతులు రహదారిలో ఆరబెట్టుకున్న మొక్కజొన్న

త్వరలో కొనుగోలు కేంద్రాలు



జిల్లాలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయమని ప్రభుత్వం ఆదేశించింది. మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి క్వింటం రూ.2400 మద్దతు ధరతో కొంటాం.

– సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీఏ

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

• ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

కర్నూలు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర శివారులో సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో హైదరాబాద్ జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తమిళనాడు డ్రైవర్ శివాజీ గణేష్(35) మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న బైక్ కిందపడటంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిని తప్పించే క్రమంలో వెనుకాల వస్తున్న ఓకంటైనర్ రోడ్డుకు ఓ పక్కకు వచ్చి సడెన్ బ్రేక్ వేశారు. దీని వెనుక తమిళనాడు చెందిన ఐచర్ వచ్చి కంటైనర్‌ను ఢీకొట్టింది. కంటైనర్‌లో ఉన్న డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో ఆయను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తమిళనాడు వాసి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఐచర్ వెనుకవస్తున్న మరో కారు కూడా ఐచర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని కూడా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

● బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ వద్ద నారాయణపేట జిల్లా కోసిగి మండలం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొంత మంది ఓమినీ వాహనంలో తిరుమల వెళ్తున్నారు. వీరి వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న ఓలారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓమినీ డ్రైవర్ వెంకటయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8వ తేదీన నాలుగేళ్ల బాలిక రేణుకను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు మధు అనే వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. వెల్దుర్తి మండలం బుక్కాపురానికి చెందిన మధు కర్నూలు ముజఫర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. బాలిక తల్లి సునీత కర్నూలులో భిక్షాటన చేసుకుంటూ బళ్లారి చౌరస్తా సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిద్రి స్తుంటారు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున మధు ఆబాలికను ఎత్తుకెళ్లి హైదరాబాదులో విక్రయించే ప్రయత్నం చేశాడు. తల్లి సునీత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తరుచూ మధు అనే వ్యక్తి సునీత వద్దకు వచ్చి మాట్లాడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. మధుపై అనుమానం రావడంతో నిఘా పెట్టారు. అన్ని రైల్వేస్టేషన్లు, పోలీస్‌స్టేషన్‌లో, బస్టాండులలో సమాచారం ఇచ్చారు. సికింద్రాబాదు రైల్వేస్టేషన్‌లో స్థానిక పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో కర్నూలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆవ్యక్తి మధుగానే గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



అరెస్టును చూపుతున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువళ్లి గ్రామంలో బళ్లారి రహదారిలో సోమవారం మధ్యాహ్నం కుక్కను తప్పించబోయి స్కూటర్ అదుపు తప్పిన ప్రమాదంలో హాలహర్వి గ్రామానికి చెందిన పింజారి షేక్షావలి(30) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివీ.. హాలహర్వికి చెందిన షేక్షావలి ఆలూరులో పని ముగించుకుని స్కూటర్‌పై స్వగ్రామానికి బయలుదేరగా కురువళ్లి గ్రామం వద్ద అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి షేక్షావలి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన షేక్షావలిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. షేక్షావలికి భార్య షాబీబీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

కర్నూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పది కార్పోరేషన్లు, అభివృద్ధి బోర్డులకు డైరెక్టర్లను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు నియోజకవర్గానికి చెందిన కౌశిక్ వాయుగండ్లను ఏపీ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరుగా నియమించారు. ఏపీ నగర/ ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పాణ్యం నియోజకవర్గానికి చెందిన కల్లూరు అర్బన్ గీతా నగర్‌కు చెందిన టీడీపీ క్లస్టర్-10 ఇన్‌చార్జి పీయూ మాదన్న, పత్తికొండ నియోజకవర్గానికి చెందిన వీఎల్ ప్రసాద్‌లను నియమించారు. పీయూ మాదన 1994 నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఇటీవలే ఈయన భార్య టీడీపీ నాయకురాలు శివమ్మ శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పది కార్పొరేషన్లకు దాదాపుగా 122 మంది డైరెక్టర్లను నియమించినా జిల్లాకు కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం ఇవ్వడం కొసమెరుపు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాలకు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల నియామకంలో ప్రతిసారి అన్యాయం జరుగుతుందని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీయూ మాదన్న

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన ఆపరేషన్

• కదిరి వాసికి ఎముకల క్యాన్సర్‌కు సర్జరీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఓ మహిళకు క్లిష్టమైన ఎముకల క్యాన్సర్‌కు అరుదైన ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన 54 ఏళ్ల మహిళ ఎడమ తొడ కింద భాగంలో వాపుతో బాధపడుతూ గత నెల 15వ తేదీ హాస్పిటల్‌లో అడ్మిషన్ అయింది. డా.బ్రహ్మ మహేశ్వ రరెడ్డి, డా.శివకృష్ణ పరీక్షలు చేయగా.. కండ్రోసర్కోమా అనే ఎముకల క్యాన్సర్‌గా నిర్ధారించారు. గత నెల 27వ తేదీన క్యాన్స ర్‌పై భాగం వరకు కాలుతీసి వేయకుండా క్యాన్సర్ ఉన్న ఎముక, కండరాలను మా త్రమే తొలగించి కృత్రిమ ఎముక (మెగా ప్రొస్థెసిస్) వేసి కాలును కాపాడారు. సర్జరీ అనంతరం రోగికి జాగ్రత్తలు తెలియజేసి వాకర్ సహాయంతో నడిపించారు. ఈ నెల 10వతేదీ సాయంత్రం రోగిని డిశ్చార్జ్ చేసినట్లు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ తెలిపారు. హాస్పిటల్‌లో ఇలాంటి ఎముకల క్యాన్సర్ సర్జరీ చేయడం మొట్టమొదటిదని ఆర్థోపెడిక్, సర్జికల్ అంకాలజీ, అనస్థీషియా పెథాలజీ, డా.చైతన్య వాణి, డా.బీసన్న, డా.భారతి, డా.వరలక్ష్మి, ఎముకల క్యాన్సర్ వైద్యులు డా.బ్రహ్మామహేశ్వరరెడ్డి డా.శివకృష్ణను అభినందించారు.

'పందికోన'లో ఆగని వేట..!

• రెచ్చిపోతున్న అక్రమార్కులు
• లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దోపిడీ
• పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
• వేలం ఎప్పుడో?

పందికోన రిజర్వాయర్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. తాజా చేపలను కొనేందుకు జనాలు ఎగబడ్డారు. ఇక్కడ జూన్ 30వ తేదీ నాటికే చేపల వేట గడువు ముగిసింది. అయినా అక్రమార్కులు చేపల వేట కొనసాగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఇంతలా జరుగుతున్నా మత్స్య శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అసలు వేలం గడువు ముగిసి 4నెలలు దాటుతున్నా వేలం నిర్వహించకపోవడానికి కారణం ఏమిటో అర్థం కావడం లేదు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చాక వేలం నిర్వహిస్తామని చెబుతున్నారు. అప్పటి వరకు చేపల అక్రమ వేట కొనసాగుతుందా..? లేక అధికారులు ఏమైనా చర్యలు చేపడుతారా? కాలమే నిర్ణయించాలి.



రిజర్వాయరు వద్ద చేపలను విక్రయిస్తున్న వ్యాపారులు

పత్తికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో అక్రమార్కుల చేపల వేట కొనసాగుతూనే ఉంది. జూన్ 30తో గడువు ముగిసినప్పటికీ గతంలో వేలం పాడుకున్న వ్యక్తులు రిజర్వాయరులో నిత్యం చేపల వేట సాగిస్తూ లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మత్స్యశాఖ అధికారులు కన్నెత్తి చూడ డం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గడువు ముగిసినా..

2025 జూన్ 30తో గడువు ముగిసినా సదరు వేలం పాటదారుడు తను ఏర్పాటుచేసుకున్న అనుచరులతో నాలుగు నెలలకు పైగా చేపల వేట సాగిస్తూ వేరే ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. పందికోన రిజర్వాయరకు సంబంధించి చేపల వేట వేలాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాలేదని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులకు ఒకేసారి నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేస్తుందని అప్పటివరకు వేలం వేయలేమంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న చేపలవేటపై వారు ఎందుకు చర్యలు చేపట్టడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకుల బెదిరింపుల కారణంగా చర్యలు చేపట్టం లేదా? మరేమైనా కారణాలు ఉన్నాయా? అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.



రిజర్వాయర్ వద్ద సిద్ధంగా ఉన్న బోట్లు

బెస్త సంఘాలకు..

రిజర్వాయరులో గాని చెరువుల్లోగాని చేపల పెంపకంను స్థానికంగా బెస్త సంఘాలకు కేటాయించాల్సి ఉంటుంది. పందికోన రిజర్వాయరు సమీప గ్రామాలైనా పందికోన, కొత్తపల్లి గ్రామాల్లో బెస్త సంఘాలు లేకపోయినా రిజర్వాయరుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పత్తికొండలో రిజిష్టర్ బెస్త సంఘాలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది వేలం పాటల్లో పాల్గొనేందుకు మత్స్యశాఖ అధికారులను కలిసినప్పటికీ తమ వర్గానికి వారు చేపల వేట కేటాయించేందుకు అంగీకరించలేదని బెస్త సంఘాలు చెబుతున్నాయి.

తిరునాళ్లను తలపించిన..

పందికోన రిజర్వాయరు వద్ద ఆదివారం చేపలు కొనేందుకు వచ్చిన వారితో తిరునాళ్ల తలపించింది. అక్రమార్కులు పట్టిన చేపలను కిలో రూ.100, 150 చొప్పున విక్రయాలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చేపల కంటే అప్పటికప్పుడు పట్టిన చేపలు రుచిగా ఉంటాయని కొనేందుకు వచ్చిన ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సార్ చెబితేనే చేపలు వేటాడుతున్నాం



మా కృష్ణసార్ చెబితేనే పందికోన రిజర్వాయరులో చేపలు పడుతున్నాం. చేపల వేటకు సమయం ముగిసింది అన్న విషయం మాకు తెలీదు. జీతానికి పనిచేస్తూ మా సార్ చెప్పిందే పనిగా ఇక్కడ చేపలు పడుతున్నాం. ● చాంద్‌బాషా, సూపర్‌వైజర్

అక్రమార్కులపై చర్యలు చేపడతాం..

పందికోన రిజర్వాయరులో చేపల వేట సాగిస్తున్న వారిపై చర్యలు చేపడతాం. ని బంధనలకు విరుద్ధంగా ఎవరైనా నడుచుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. - రంగనాథ్‌బాబు, మత్స్యశాఖ జిల్లా అధికారి, కర్నూలు

రైతులకు అండగా ఉంటాం

• త్వరలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
• వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
• మంత్రిని కలిసిన కలెక్టర్, జేసీ, ప్రజాప్రతినిధులు



మంత్రికి బొకే అందిస్తున్న కలెక్టర్, నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలుస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం రాత్రి మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి కర్నూలుకు వచ్చారు. నగరంలోని మౌర్యఇన్‌లో ఆయన బస చేశారు. కలెక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో పాటు వ్యవసాయ అనుబంధ విభాగాల జిల్లా అధికారులు మంత్రిని కలిశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రిని కలిసి జిల్లా పరిస్థితులను వివరించారు. ఉమ్మడి జిల్లాలో పంటల సాగు, పంట ఉత్పత్తులపై రైతులకు అందుతున్న మద్దతు ధరలపై సంబంధిత అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం పెద్దగా లేదని పంట నష్టం ఎక్కువగా జరగలేదని వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటకు సంబంధించి మద్దతు ధర కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయన మూర్తి మంత్రి దృష్టికి తెచ్చారు. ఏయే పంట ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందడం లేదో అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పత్తికి మద్దతు ధరను అందించడంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల సీసీఐ అధికారులు కొనుగోలు జరపడం లేదని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సమస్యపై సీసీఐ కేంద్ర అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున లేఖను పంపుతామని, కేవలం 12శాతం ఉంటేనే మద్దతుధరను అందించాలన్న నిబంధనను సడలించాలని కోరామన్నారు. ప్రభుత్వ విజ్ఞప్తికి సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన గౌరు చరిత

కల్లూరు: వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కలిశారు. సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రిని ఎమ్మెల్యే మౌర్యాఇన్ హోటల్‌లో బొకేతో స్వాగతం పలికారు. ఇటీవల తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయని, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించాలని ఆదుకోవాలని మంత్రిని కోరారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అర్జీలను పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పబ్లిక్ హెల్త్‌లో రీ ఓపెన్ శాతం 50 శాతం ఉందన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 5, కర్నూలు ఆర్డీవో వద్ద 9, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, సర్వే ఏడీ వద్ద 3, కలెక్టరేట్ ఏవో వద్ద 2, డిస్ట్రిక్ రిజిస్ట్రార్ వద్ద 2, సివిల్ సప్లయిస్ వద్ద 2, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ పీడీ, ఏపీఐఐసీ జెడ్ఎంల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ ఉన్నాయని, బియాండ్ ఎస్ఎల్ఏలో వెళ్లకుండా పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ నూరుల్ కమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య ఉన్నారు.

పార్కు భూముల కబ్జాకు యత్నం...!

నగరంలోని నిర్మల్‌నగర్, గురు రాఘవేంద్ర నగర్, గీతానగర్ పరిధిలో పార్కు భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని రాయలసీమ ఉద్యమ యువనాయకులు సీమకృష్ణ, రాథోడ్, రవికుమార్, మాదాసి కురువ సుంకన్న కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్‌పీ-121/1981 పేరుతో ఆమోదించిన లేఅవుట్‌లో మొత్తం 19.66 ఎకరాలు ఉండగా.. అందులో 1.01 ఎకరాలను పార్కు/ ఓపెన్ స్పేస్ కోసం కేటాయించారు. 301/బి, 302, 302/2, 304/1, 305/2, 284/5, 286/1, 287/1 సర్వే నెంబర్లలో ఈ లేఅవుట్ ఉందన్నారు. కబ్జాదారులు బోగస్ డాక్యుమెంట్లు రూపొందించి ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విచారణ చేపట్టాలని కోరారు.

చిన్నారులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న చిన్నారులు

ఆదోని రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపురంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రం-2లో 5 సంవత్సరాల్లోపు పిల్లలు 31 మంది ఉన్నారు. సోమవారం 26 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు అంగన్‌వాడీ సిబ్బంది పుష్ప పిల్లలందరికీ అంగన్‌వాడీ పాలు అందించారు. మధ్యాహ్నం 12:30గంటలకు అన్నంతోపాటు దోసకాయ పప్పును పిల్లలకు పెట్టింది. మధ్యాహ్నం 2:30 గంటలకు 8 మంది మగ పిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలు ఏడవడం ప్రారంభించారు. అమ్మా కడుపునొప్పి అంటూ ఏకధాటిగా వాంతులు చేసుకోవడంతో పాటు అక్కడే కుప్పకూలి పోయారు. విషయం గ్రహించిన పుష్ప హెల్త్ అసిస్టెంట్ వద్ద మందులు తెచ్చి వేసింది. ఆపది మంది చిన్నారులు వాంతులు చేసుకుంటూ కడుపునొప్పితో ఏడుస్తుండడంతో వారి ఇళ్లకు వదిలి చేయి దులుపేసుకున్నారు. ఆ పిల్లలు ఇంటికి వెళ్లినప్పటికీ పిల్లలు వాంతులు చేసుకుంటూ కడుపునొప్పితో ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. సీడీపీవో డిల్లీశ్వరి గ్రామానికి చేరుకుని స్థానికంగా ఉండే హెల్త్ సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ రాత్రి 8 గంటల సమయంలో గ్రామానికి చేరుకుని పిల్లల ఆరోగ్యం గురించి ఆరాతీశారు. వీరిలో మూడేళ్ల వైశాలి, నాలుగేళ్ల వయస్సు గల సుదర్శన్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో రాత్రి 10 గంటలకు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలుకా సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజనేయులు ఆసుపత్రికి చేరుకుని పిల్లల ఆరోగ్యంపై ఆరాతీశారు. అపరిశుభ్రమైన పాత్రల్లో, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేయడంతో పిల్లలకు వడ్డించడంతోనే ఇలా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

న్యాయం చేస్తాం

• పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 99 సమస్యలు: ఎస్పీ విక్రాంత్ పాటిల్



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 99 ఫిర్యాదులు వచ్చాయి.

● కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సీ.క్యాంపు చెందిన రాఘవరెడ్డి రూ.1లక్ష తీసుకుని మోసం చేశాడని తాడిపత్రికి చెందిన నరసింహులు ఫిర్యాదు చేశారు.

● నవీన్‌కుమార్ అనే వ్యక్తి వీసా ఇప్పిస్తామని చెప్పి రూ.30వేలు తీసుకుని మోసం చేశాడని లక్ష్మీనగర్‌కు చెందిన సాదిక్ ఫిర్యాదు చేశారు.

● శంకర్ అనే వ్యక్తి కర్నూలు పాతబస్టాండు దగ్గర దీపక్ లక్కీగోల్డ్ స్కీం పేరుతో డబ్బు కట్టించుకొని మోసం చేసి వెళ్లిపోయాడని కర్నూలు సీ.క్యాంపు చెందిన లక్ష్మి ఫిర్యాదు చేశారు.

● మూడో కుమార్తె ధనలక్ష్మి తన ఇంటిని ఆక్రమించుకోవాలని బయటకు పంపించిందని, కర్నూలు చెందిన నరసమ్మ ఫిర్యాదు చేశారు.

మల్లన్న సన్నిధిలో ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు


మల్లన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్

శ్రీశైలం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను రాష్ట్ర ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు దర్శించుకున్నారు. సోమవారం రాత్రి ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ పర్యవేక్షకులు హరికృష్ణరెడ్డి స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలతో తీర్థప్రసాదాల తో పాటు పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

తెలుగుభాషకు అపూర్వ సేవ

● ఎస్పీ సునీల్‌షెరాన్


సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అపూర్వ సేవ చేశారని ఎస్పీ సునీల్ షెరాన్ కొనియాడారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సీపీ బ్రౌన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ఆత్మకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యా లయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. కాగా, కేజీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దాంతో అర్బన్ సీఐ రాము, ఏడీఏ హేమ లత ధర్నా విరమించాలని కోరినా వినిపించుకోలేదు. దీంతో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో హామీ ఇప్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నా యకులు మహెబూబ్‌బాషా, సుధాకర్, మాబాషా, వీరన్న, సంజీవరా యుడు, రణధీర్, రామ్‌నాయక్, స్వాములు, కిరణ్, శివుడు ఉన్నారు.

మౌలానా అబుల్‌కలాం సేవలు మరువలేనివి


జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత రత్న మౌలానా అబుల్ కలాం సేవలు మరువ లేనివని ఆల్‌మేవా నా యకులు కొనియాడారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఆల్‌మేవా నాయకులు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, ఎన్ఎండీ అబులైస్‌ల ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని ముందస్తుగా నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామ చంద్రారావు, జమాతే ఇస్లామి హింద్ నాయకులు అబ్దుల్ సమద్, కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాలలోని తేజశ్వని హోటల్లో నంద్యాల, గోస్పాడు మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనెపల్లెలోని ఉదయానంద రెసిడెన్సీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడుతామన్నారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సం ఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మె ల్సీ ఇసాక్ బాషా, పీపీ నాగిరెడ్డి, నంద్యాల వైసీపీ ఉపాధ్యక్షుడు దాలమీ ల్ అమీర్, పీపీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

గడివేముల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణానికి చెందిన పల్లె ప్రియాంకసేవా సమితి అందజేసిన మెటీరియల్‌ను మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఎంఈవో సుబ్బరామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లె ప్రియాంక సేవా సమితి అధ్యక్షుడు విశ్రాంత న్యాయాధికారి మోహన్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు శివరాముడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు పక్కీర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగుణశ్రీ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సమావేశానికి ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షత వహిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎదురుపాడు పాఠశాలకు దారి చూపాలి

కొత్తపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడులోని మండల ప్రజాపరిషత్ పాఠశాలకు దారి చూపాలని సమతా సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు నగినాల సురేష్, మండల అధ్యక్షుడు నేరేడు పుల్లయ్య కోరారు. సోమవారం వారు పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శించారు. సురేష్ మాట్లాడుతూ పాఠశాలకు ఇరువైపుల రోడ్డు ఆక్రమణకు గురైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

యురాలజీ రాష్ట్ర సదస్సు విజయవంతం


మాట్లాడుతున్న డాక్టర్ భార్గవర్ధన్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల యురాలజీ వైద్యసంఘం, నంద్యాల, కర్నూలు జిల్లాల యురాలజీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సు విజయవంతమైందని నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ భార్గవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కోశాధికారి డా.జైబాబురెడ్డి, డా.శ్రీకాంతరెడ్డి, డా.దాసరి రమేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రెం డు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో 25మంది జాతీయ స్థాయి ప్రఖ్యాతిగాంచిన యూరాలజీ వైద్యనిపుణులు పాల్గొనారన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన 300మంది యూరాలజీ వైద్యప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ తరఫున ని రంతర వైద్యవిద్య 4పాయింట్ల సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.విజయభాస్కరరెడ్డి, డా.మధుసూదన్‌రెడ్డి, డా.అనిల్‌కుమార్, డా.రవికృష్ణ పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు ఆదర్శప్రాయం

● ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్‌అప్పావ్
● అమరులకు నివాళి


అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న డీడీ విఘ్నేష్ అప్పావ్

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ అమరుల సేవలు ఉద్యోగలందరికీ ఆదర్శప్రాయమని ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్‌అప్పావ్ అన్నారు. సోమవారం రాష్ట్ర అటవీ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బైర్లూటి ఎకోటూరిజంలోని దివంగత రేంజ్ అధికారి రామయ్య స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి, ఇటీవల వెలుగోడు రేంజ్‌లో మరణించిన ప్రొటెక్షన్ వాచర్ లక్ష్మానాయక్ చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణకు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. అడవులే మానవాళి జీవనానికి మూలమని ఇంతటి ప్రాధాన్యత కలిగిన అడవుల రక్షణలో తాము విధులు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. అటవీ ఉద్యోగులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ అటవీ, వన్యప్రాణుల రక్షణకు పాటుపడాలని సూచించారు. అనంతరం లక్ష్మానాయక్ కుటుంబ సభ్యులకు అటవీ ఉద్యోగుల సహకారంతో రూ.65వేల ఆర్థిక సాయాన్ని అం దజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, బైర్లూటి, వెలుగోడు రేంజర్లు రాజు, కృష్ణప్రసాద్, తాహీర్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో అరుణ్ డేవిడ్, ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు అనిల్, అటవీ సిబ్బంది ఉన్నారు.


బండిఆత్మకూరులో అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సిబ్బంది

బండిఆత్మకూరు: అటవీ సంరక్షణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన అధికారుల సేవలు మరువలేనివని ఎఫ్ఎస్‌వో నాగరాజు అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం బండి ఆత్మకూరు రేంజ్ కార్యాలయంలో అమరుల చిత్రపటానికి అధికారులు ని వాళి అర్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో హైమావతి, అధికారులు చంద్రశేఖర్‌చ కాశీమ్‌నాయక్, రాజేష్, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యత లేకుంటే ఎలా?

● నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం
● ఆదర్శ పాఠశాల, హాస్టల్ తనిఖీ


సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై బాధ్యత లేకుంటే ఎలా అని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆదర్శపాఠశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను, హాస్టల్‌లో విద్యార్థుల హాజరును పరిశీలించారు. సిబ్బంది మాటల తీరుకు, రికార్డులకు ఎటువంటి పొంతన లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూప్రకారం మధ్యాహ్నభోజనం చేయకుండా విద్యార్థుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డొక్క సీతమ్మగారి మధ్యాహ్నభోజన పథకం అని ఎక్కడలేదని, సీఎం ఫొటోలు కూడా లేవని మండిపడ్డారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండలకన్వీనర్ మోహన్‌రెడ్డి, టీడీపీనాయకులు శ్రీనివాసులు, పరమేశ్వరరెడ్డి, సుధాకర్, పెద్దన్న, ప్రసన్నరెడ్డి, గిరీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, రవికాంత్, నారాయణరెడ్డి, ఉసేనయ్య, శేఖర్‌గౌడు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జూపాడుబంగ్లా/నందికొట్కూరురూరల్: జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం, జూపాడుబంగ్లా, పోతులపాడు, తరిగోపుల, నందికొట్కూరు పట్టణం, కొణిదేల గ్రామాల్లో నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పర్యటించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురి బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

● దివ్యాంగుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు దేవరాజు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్న దివ్యాంగులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని దివ్యాంగుల జిల్లా జేఏసీ అధ్యక్షుడు దేవరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతమంది పాలకులు వచ్చిన దివ్యాంగులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన సమస్యలు పరిష్కారించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో రామునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

అడవి ఉత్పత్తులు సేకరించి జీవిస్తున్నామని, ఇప్పుడు అడవికి వెళ్లొద్దని ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, తమకు జీవనోపాధి చూపాలని మహానందికి చెందిన ఈశ్వరిపురం చెంచు దాసరి కులస్థులు కోరారు. సోమవారం జనసేన పార్టీ నాయకులు రామచంద్రుడు, ప్రసాదు, కాకర్ల శివ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే ఉపాధి పనులు ఏర్పాటు చేయాలని డ్వామా అధికారి శ్రీనివాసులును ఆదేశించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న బనగానపల్లి బీసీ బాలుర వసతిగృహ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో రామునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్స్ ఫెడరేషన్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న, తెలుగు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇండ్ల జయరాజు, గిరిజన విద్యార్థి సమైక్య రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి ముడవత్ రవీంద్రనాయక్, బహుజన స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, విద్యార్థులున్నారు.

నేడు 5 స్టార్ హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన

● వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

శ్రీశైలం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు అందుబాటు లో ఉండేలా శ్రీ వేంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు చేపడుతున్న 5 స్టార్ హోటల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు అభివృద్ధి పనులను శ్రీకారం చుడుతున్న సీఎం శ్రీశైలంలో 5స్టార్ హోటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ జీవి ఆంజనేయులు, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, తహసీల్దారు శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావుతోపాటు సంస్థ నిర్వాహకులు ఆర్ వెంకటరమణ (సుందర్), ఆర్ శ్రీనివాసన్ మునీశ్, సునీల్ కులకర్ణి తదితరులు పాల్గొంటున్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

పాణ్యం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గగ్గటూరు, కందికాయపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు కేజే శ్రీనివాసరావు కోరారు. సోమవారం కలెక్టరు, డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

అంతా శివమయం

● శివాలయాల్లో ప్రత్యేక పూజలు
● దీపాలు వెలిగించిన భక్తులు


నంద్యాలలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమోగాయి. మహిళలు ఆలయాలలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు.

నంద్యాల పట్టణంలో శివాలయాల్లో ఉదయాన్నే భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ప్రథమనందీశ్వరాలయంలో భక్తులు శివయ్య ను దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రథమ నంది, నాగ నంది, సోమ నంది, సంజీవ నగర్ రామాలయం, అమ్మస్ప టికలింగేశ్వరాలయం, బ్రహ్మానందీశ్వరాలయం, మల్లికార్జున స్వామి, నాగలింగేశ్వరాలయం, శ్రీకృష్ణమందిరము తదితర ఆలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు.


ప్రత్యేక అలంకారంలో నాగలింగేశ్వరస్వామి


ఓంకారంలో గంగా, ఉమా సమేత సిద్దేశ్వర స్వామి వార్ల కల్యాణం




పాలకేశ్వరస్వామి వద్ద పూజలు చేసిన రామకృష్ణ విద్యాసంస్థల అధినేత

బండిఆత్మకూరు: మండలంలోని గంగా, ఉమా సమేత సిద్దేశ్వరస్వామి వార్లకు ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. వందలాది మంది సామూహిక నోములు ఆచరించారు. దీపాలు వెలగించారు. నంద్యాల విద్యార్థినుల భరత నాట్యం భక్తులను అలరింపజేసింది. కాశిరెడ్డినాయన ఆశ్రమంలో భక్తులకు అన్న దానం నిర్వహించారు.

కమనీయం.... కల్యాణం

గంగా, ఉమా సమేత సిద్దేశ్వర స్వామి వార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయం త్రం స్వామి వార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలోకి మేళతాళాల వాయిద్యాల మధ్య అర్చకులు చక్రపాణి మృగపాణి కల్యాణ క్రతువును నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా చైర్మన్ చెన్నారెడ్డి, నరసింహారెడ్డి దంపతులు వ్యవహరించారు. వేడుకల్లో ఈవో ఆకృతి నాగప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

గంగా, ఉమా సమేత సిద్దేశ్వరస్వామి వార్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఓంకార క్షేత్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి, ఈవో నాగప్రసాద్ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. వెంట కేసీ కెనాల్ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, తెలుగుగంగ జిల్లా వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, మండల నాయకులు సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాబు, సుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, మదన భూపాల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయం కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి దుర్గాభోగేశ్వరుడికి, బాలత్రిపురాంబసమేత పాలకేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, గిరిధర్ శర్మలు స్వామివారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలను నిర్వహించారు.

14న జాబ్‌మేళా

నంద్యాల నూనెపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జ్ఞానపురం నేషనల్ ఐటీఐ కళాశాలలో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో ఉద్యోగాలుంటాయని డిప్లొమా, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ పూర్తైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోలు తీసుకొని హాజరుకావాలని కోరారు. తమ వివరాలను డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ఎన్‌సీఎస్.గవర్నమెంట్. ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

'తల్లికి వందనం' అందలేదు

పాణ్యం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'తల్లికి వందనం' అందలేదని ఎన్ఎస్‌యూఐ నాయకుడు ప్రతాప్ అన్నారు. సోమవారం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో కోటయ్యలకు వినతి అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వే ణు, ముజేమిల్, పరమేశ్, సురేంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రక్తదానం మహా దానం

బండిఆత్మకూరు నవంబరు10(ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని ఈవో నాగప్రసాద్ అన్నారు. సోమవారం ఓంకారంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ చెన్నారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

పాములపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండు ఆవరణలో మరుగుదొడ్ల ని ర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. సోమవారం రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆర్అండ్‌బీ రోడ్లను కొలతలు వేశారు. ప్రయాణికులకు వసతులు కల్పించేందుకు స్థలాన్ని పరిశీలించామని అధికారులు తెలిపారు.

కార్తీక వన భోజనాలు..

పాములపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో గ్రామస్థుల సహకారంతో వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ మండల నాయకుడు ఆళ్లగడ్డ హరిసర్వోత్తమరావు హాజరయ్యారు. ఉసిరిచెట్టుకు, అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించారు.

ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా సురేశ్



పాములపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన రాచపూడి సురేశ్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సురేష్‌కుమార్



నంద్యాల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సగర , ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నంద్యాలకు చెందిన ఉప్పరి సురేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా, ఉప్పరి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

'ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి'

నంద్యాల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో పది గంటల పని విధానాన్ని అమలు చేయాలని ఉత్తర్వులు జారీచేయడం కార్పొరేట్ సంస్థల కోసమేనని ఆరోపించారు. ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాను. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, మహమ్మద్‌గౌస్, జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, బాలవెంకట్ పాల్గొన్నారు.

ఉర్దూ భాషను అమలు చేయాలి

ఆత్మకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉర్దూభాషాను అమలు చేయాలని ఎస్‌డీపీఐ శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు ఆరీఫ్ హుసేన్ కోరారు. సోమవారం తహసీల్దార్ రత్నరాధికకు ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గౌస్‌మోద్దీన్, మాసూంబాషా, ఇమ్రాన్, ఫయాజ్, అబ్దుల్లా, మహ్మద్‌రఫీ రఫీ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిని కాపాడిన హమాలీలు

బండిఆత్మకూరు నవంబరు10(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో కొట్టుకపోతున్న ఓ వృద్ధురాలిని హమాలీలు కాపాడారు. ఎస్ఐ జగన్మోహన్ వివరాల ప్రకారం.. వెలుగోడు మండలం బోయరేవులకు చెందిన ఓబులమ్మ అనే వృద్ధురాలు సోమవారం మండలంలోని వారాధి వంతెన వద్ద వీరభద్రస్వామి ఆలయంలో మధ్యాహ్నం భోజనం చేసింది. అనంతరం చేతులు కడుగుకునేందుకు కాల్వలో దిగింది. మెట్లపై జారి కొట్టుకొని పోయింది. వరి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న రామాపురం గ్రామానికి చెందిన హమాలీ నాగేంద్ర మరికొందరు గుర్తించి నీటిలోకి దూకి ఆమెను ఒడ్డుకు చేర్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం బండిఆత్మకూరు స్టేషన్‌కు తీసుకెళ్లి ఏఎస్ఐ అక్బర్‌కు అప్పగించారు. వృద్ధురాలి కొడుకు రమేష్‌కు సమాచారం ఇచ్చారు. అతడు రాగ ఆమెను అప్పజెప్పారు. హమాలీలను ఎస్ఐ, సిబ్బంది అభినందించారు.

జిల్లాలో హై అలర్ట్

● ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో తనిఖీలు


నంద్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సోమవారం సాయంత్రం ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడుతో జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో హై అలర్ట్ చేస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. నంద్యాల, కోవెలకుంట్ల, బేతంచెర్ల, మహానంది, ఆళ్లగడ్డ ఆత్మకూరు వంటి ప్రదేశాల్లో ప్రధానంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, లాడ్జిల వద్ద అనుమానితులు ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. హైవేపై, పట్టణంలో వెళ్తున్న వాహనాలు తనిఖీ చేశారు. ఎవరిపైన అనుమానం ఉన్న అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు సుధాకర్‌రెడ్డి, అస్రర్‌బాషా పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కార్తీక' సందడి

● భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
● కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

కొలిమిగుండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి మహిళలు ఆలయానికి చేరుకొని కార్తీక దీపాన్ని వెలిగించారు. లొక్కిగుండం క్షేత్రం, నేలబిలం మల్లేశ్వరస్వామి, పెట్నికోట కాశీ విశ్వేశ్వరస్వామి, గుండు మల్లేశ్వరస్వామి, బెలుం సిద్ధరామేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో సామూహిక అభిషేకాలు, అర్చనలు చేశారు.

దిగువ అహోబిలంలో వన భోజనోత్సవం

ఆళ్లగడ్డ: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన దిగువ అహోబిలంలో కోనేరు సమీపం లోని లక్ష్మీవనంలో మూడో కార్తీక సోమవారం సందర్భంగా వన భోజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు గ్రామోత్సవం, అభిషేకం పూజలు నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి తెలిపారు. ఆహోబిలం క్షేత్రంలో సోమ వారం వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వాతి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆళ్లగడ్డకు చెందిన వైద్యులు నరసింహారెడ్డి, శివమ్మ హాజరై పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు

● ఆళ్లగడ్డ పట్టణ శివారులో వెలసిన కాసింతల క్షేత్రంలో సోమవారం వృక్షయజ్ఞం సేవా సొసైటీ వ్యవస్థాపకురాలు లావణ్య ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆవు పిడకలతో తయారు చేసిన దీపపు ప్రమిదలు, వత్తులు, నూనే వంటి వస్తువులను వృక్షయజ్ఞం సంస్థ వారు మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. దీపా లను వకులా నదిలో వదిలి కాశీవిశ్వేశ్వరుడు, పార్వతీదేవిలకు పూజలు చేశారు.

సాయిబాబా ఆలయంలో ఏపీఎస్ఎస్‌డీసీఎల్ చైర్మన్ పూజలు

డోన్ టౌన్: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలోని శివాలయంలో ఏపీ రాష్ట్ర సీడ్స్ డెవలపెమెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, సతీమణి మన్నె మల్లేశ్వరమ్మ పూజలు చేసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న సాంబ సదాశివాలయంలో భక్తులు పాల్గొని అన్నాభిషేకం చేశారు. ఈ పూజల్లో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని సాంబశివాలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని శివుడికి భక్తులు అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ పురోహితులు శేషావలి శర్మ ఆధ్వర్యంలో శివలింగానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రుద్రవరం: మండలంలో కార్తీక సోమవారం శివాలయాల్లో భక్తులు అభిషేకాలు చేశారు. నల్లమలలో ఉన్న ఉల్లెడకొండకు భక్తులు చేరుకుని ఉల్లెడమల్లేశ్వరస్వామి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రవరం, వాసాపురం, చిన్నకంబలూరు మెట్ట, కాశీవిశ్వేశ్వరాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవీశ్వర ఆలయాల్లో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ఓంకార నాదాలతో కార్తీకశోభ నిండుకుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆకాశదీపాన్ని వెలిగించి పూజలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించారు. భైరవీశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా చాగలమర్రిలోని పాత శివాలయంలో ఈశ్వరస్వామి అన్నాభిషేక అలంకారంలో కొలువు దీరారు. స్వామిజీ అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో ఈశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకొని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాకరాజువేముల గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యుడు విజయ్‌సింహచౌదరి ఆధ్వర్యంలో తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. భాగ్యనగరం లోని రామాలయం, దొర్నిపాడు శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు. భక్తులకు పురోహితులు ప్రసాద్‌శర్మ, నాగేశ్వరయ్యలు తీర్థప్రసాదాలు అందజేశారు.

అవుకు: కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో సోమవారం కిటకి టలాడాయి. పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, చెర్లోపల్లెలోని బుగ్గమ ల్లేశ్వస్వామి, శివవరంలోని శివాలయాల్లో అర్చకులు శివుడికి అభిషే కాలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.


డోన్‌లో శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు, చాగలమర్రిలో.. బెలుం సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో, చాకరాజువేములలో అన్నదానం


దిగువ అహోబిలంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు


కొలిమిగుండ్ల శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


రామలింగేశ్వర ఆలయంలో ఆకాశదీపానికి పూజలు చేస్తున్న మహిళలు


అవుకు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రుద్రవరం: వాసాపురంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మధ్యాహ్న భోజన నిర్వహకులకు సూచించారు. సోమవారం మండలంలోని ఎం.పెండేకల్, ముద్దవరం, కొలుములపల్లె గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను, గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు బోధన పద్ధతులు, భవనాల స్థితిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో నమ్మకం పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎం.పెండేకల్, ముద్దవరం సచివాలయాల్లో జరుగుతున్న ప్రజా సేవలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఎమ్మెల్యే సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, నాయకులు తిరుమలేష్ చౌదరి, సచివాలయాల సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

బనగానపల్లె, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఎస్పీ సునీల్ షెరాన్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన శాంతి భద్రతల విషయమై సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ, ఎస్ఐలను ఆయన ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. అనంతరం నందివర్గం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ గ్రామాలు, ఇతర వివరాలను ఎస్ఐ వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు.

కళాశాలలో కార్తీక వన సమారాధన


మొక్కను నాటి నీళ్లు పోస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోవెలకుంట్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణుగోపాల్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ కళాశాలలో చెట్లను సంరక్షించి తరువాత తరాలకు అందించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. గోవర్ధనం, నందివర్ధనం, నూరువరాలు, ఆల్మండ్, గులాబీ లాంటి పూలమొక్కలతోపాటు క్రోటన్, బోగన్ విల్లియా, స్నేక్‌ప్లాంట్ మొక్కలు నర్సరీల నుంచి తెచ్చి కళాశాలలో వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, న రేంద్రనాథరెడ్డి, క్రిష్ణదాసు, రమణారెడ్డి, సంటిరెడ్డి, డాక్టర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, అన్నపూర్ణ, క్రిష్ణయ్య, పుల్లయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కొత్తగా ఎంపికైన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వరబాబు కోరారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైదుకూరు రీజియన్ కో-కన్వీనర్ జగన్నాథరావు, రీజియన్ కన్వీనర్ రమేష్‌బాబు, జిల్లా కల్చరల్ కమిటీ సభ్యులుగా నాగరాజు, అకాడమిక్ కమిటీ మెంబర్‌గా నాగేంద్ర నియమితులయ్యారు. వీరికి దువ్వూరు మండలశాఖ అధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా కౌన్సిలర్ రామయ్య, సంఘ నాయకులు అభినందించారు.

ఇంటి స్థల సమస్యను..

డోన్ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలలో పేదలకు చెందిన ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రణత్ యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో పేదలకు కేటాయించిన కొన్ని స్థలాలు నిర్మాణానికి అనుగుణం గా లేకపోవడంతో వాటి పట్టాలను రద్దు చేశారన్నారు. అయితే.. ప్రభుత్వం మారిన తర్వాత సచివాలయాల్లో స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెళితే.. పట్టా స్థలాలు ఉన్నట్లు చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పృథ్వీ కుమార్, నాగరాజు, రజాక్ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయాలి

బేతంచెర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 12న డోన్‌లో చేపట్టబోయే వైసీపీ ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూ షణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బేతంచెర్లలోని పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్లను విడుదల చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర జరుగుతుందని, వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబురెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుశేన్, నాయకులు గూని నాగరాజు, సీతారామచంద్రుడు, పుసులూరు మురళికృష్ణ, కుంచా తిరుమలేశ్వర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుశేన్, మర్రికుంట మురళిధర్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రుద్రవరం నారాయణ పాల్గొన్నారు.

ఆహోబిలేశుని సన్నిధిలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్


అహోబిలం క్షేత్రంలో రాజేంద్రప్రసాద్

ఆళ్లగడ్డ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రం అహోబిలంలో సోమవారం ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఎగువ దిగువ అహో బిలాన్ని కూడా ఆయన సందర్శించారు. ఆయన వెంట అహోబిలం సినిమా ఈవెంట్ మేనేజర్ బొప్ప సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఉద్యోగం.. సాహసోపేతం

రుద్రవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో ఉద్యోగం సాహసోపేతమేనని ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్ మక్తర్‌బాషా అన్నారు. సోమవారం రుద్రవరం అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన వారి ఫ్లెక్సీకి నివాళులర్పించారు. ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే అడవుల సంరక్షణ సాధ్యమన్నారు. సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌ఖాన్, రామక్రిష్ణ, బీట్ ఆఫీసర్లు జేమ్స్‌బాండ్, సురేంద్రగౌడ్, నరసింహారెడ్డి, సుభాష్, నాగహుసేనయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని కొలిమిగుండ్ల ఎంపీ డీవో దస్తగిరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, వెంకటసుబ్బయ్య, నాగరాజు, ఉదయ్ పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి వేయించాలి

చాగలమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చెంచు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి సూచించారు. చాగలమ్మ చెంచు కాలనీలో సోమవారం ఆయూష్మాన్ భారత్ హెల్త్‌కార్డు ఇవ్వాలనే ఉద్దేశంతో చెంచులకు అవగాహన కల్పించారు. 140 మంది చెంచులకు కార్డులు మంజూరు చేశారు. ఏఎన్ఎం గార్లేట్, ఆశా వర్కర్ పుష్పలత ఉన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: ఎంఈవో

చాగలమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో సమ్మేటివ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. సోమవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నపత్రాలను పరిశీలించారు. హెచ్ఎం శివలక్ష్మి ఉన్నారు.

అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనివి

చాగలమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనివని ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆళ్లగడ్డ మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, చాగలమర్రి కన్వీనర్ బుచ్చిబాబు, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. సోమవారం చాగలమర్రి సంతమార్కెట్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవం ముందస్తు వేడుకలను నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన 25 మంది ఉపాధ్యాయులను సన్మానించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషాద్రి, రాష్ట్ర అవార్డు గ్రహీత లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ

కొలిమిగుండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనాయునిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదవువుతున్న విద్యార్థిని అవంతి రాణి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని సాధించారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన అండర్ - 14 బాలికల విభాగం పోటీల్లో పాల్గొని 600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది.

బాధ్యతతో పని చేయాలి: ఎంఈవో

కొలిమిగుండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాధ్యత పని చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఎంఈవో అబ్దుల్ కలాం నూతన ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కొలిమిగుండ్లలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

మూతపడ్డ ఆర్ఎస్‌కే కేంద్రం


గొడిగనూరులో తాళం వేసిన రైతు సేవా కేంద్రం

చాగలమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం సోమవారం మూతపడింది. సమస్యలు తెలుపుకునేందుకు వచ్చిన రైతులు ఆర్ఎస్‌కేకు తాళం తియ్యకపోవడంతో వచ్చిన దారినే వెను దిరుగుతున్నారు. ఆర్ఎస్‌కేలో విధులు నిర్వహిస్తున్న వీఏఏ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఇంతవరకు వీఏఏ పోస్టు భర్తీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీఏఏను నియమించాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు

అవుకు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ విభాగంలో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెమీమా సోమవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 7న జిల్లా స్థాయిలో జరిగిన ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ పోటీల్లో విద్యార్థులు హుశేన్, వలి రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. ఈనెల 21న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయుడు నరేంద్రతోపాటు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు..

ప్యాపిలి: మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మస్తాన్, మాబీ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8న నంద్యాలలోని మున్సిపల్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనపరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం పాఠశాలలో రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం ● ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

డోన్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సోమవారం డోన్ నుంచి ఆర్ఎస్ పెండేకలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో మండలంలోని యు.కొత్తపల్లి వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఒరిగింది. బస్సులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం శశిభూషణ్‌ను కోరగా.. కాంట్రాక్టు బేసిస్ ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న డ్రైవర్ మురళీ నిర్లక్ష్యంతోనే బస్సు అదుపు తప్పింది. ప్రయాణికులకు ఏమీ కాలేదని, నిర్లక్ష్యం వహించిన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు.


డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

చలి.. పులి

● రోజు రోజుకూ పెరుగుతున్న తీవ్రత
● పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
● వణికిపోతున్న ప్రజలు

కొలిమిగుండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి పంజా విసురుతోంది. నాలుగైదు రోజులుగా చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 18డిగ్రీలకు పడిపోతుండటంతో చలి తీవ్రత అధికమవుతోంది. రాత్రి 7, 8గంటల నుంచే చలి తీవ్రత ప్రారంభమవుతుండగా ఉదయం 8, 9గంటల వరకు చలి ప్రభావం కనిపి స్తోంది. దీనికి తోడు ఉదయం మంచు, రాత్రి వీస్తున్న చల్లటి గాలుల తీవ్రత ను మరింత పెంచుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రత్తలు మరింతగా పడిపోయో అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది భారీ వర్షాలు, తుఫాన్ నేపథ్యంలో చలి అధికంగానే ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


సోమవారం ఉదయం కురుస్తున్న పొగ మంచు

కొండ చిలువ పట్టివేత

అడవిలోకి వదిలిన అటవీ శాఖాధికారులు

రుద్రవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలూరు గ్రామంలో ఆదివారం రాత్రి ఇళ్ల మధ్య సంచరిస్తున్న కొండచిలువను గ్రామస్థులు అటవీ శాఖాధికారులు సమాచారం చేరవేశారు. దీంతో అటవీ శాఖాధికారులు సోమవారం గ్రామానికి చేరుకొని కొండ చిలువను పట్టుకొని అడవిలోకి వదిలారు. గ్రామాల సమీపంలో వన్యప్రాణులు కనిపిస్తే వాటిని హానీ తలపెట్టకుండా తమకు సమాచారం అందించాలని బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ తెలిపారు.



మా భూములు మాకే ఇవ్వాలి

డోన్ టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మా భూములు మాకే ఇవ్వాలని మండలంలోని ఎర్రగుంట్ల, వలసల, చిన్నమల్కాపురం గ్రామ రైతులు తహసీల్దార్‌ను కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అనేక సంవత్సరాల క్రితం నుంచి మా భూములు మాకే ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. తహసీల్దార్ వారికి నోటీసులు ఇచ్చి 3 గంటలకు కార్యాలయం రావాలని కోరడంతో రైతులు అక్కడికి వచ్చారు. మా పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న భూమిని ఇప్పుడు మీది కాదంటూ చెప్పడం చాలా దారుణమని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను కోరగా ఆయన స్పందించలేదు.

రైతులకు అన్యాయం జరిగితే సహించం

మండలంలోని ఎర్రగుంట్ల, వలసల, చిన్నమల్కాపురం గ్రామ రైతులకు అన్యాయం జరిగితే సహించం. రైతులు అనేక సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తూంటే.. ఆ భూములు మాదేనంటూ ఇప్పుడు నోటీసులు ఇవ్వడం ఏమిటని మండిపడ్డారు. ఆ భూమిని సాగు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి అర్హులకు ఇవ్వాలని కోరారు.

● గార్లపాటి మద్దిలేటి, డోన్ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త

విహార యాత్రలతో పరిజ్ఞానం పెంపు

దొర్నిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు విహార యాత్రలు చేయడం వల్ల పరిజ్ఞానం పెంచుకోవచ్చని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి అన్నారు. విజ్ఞానం-విహార యాత్రలో భాగంగా సోమవారం దొర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు బెలుంగుహలు, యాగంటి పుణ్య క్షేత్రం, బ్రహ్మంగారి మఠం తదితర పుణ్యక్షేత్రాలకు బయలుదేరి వెళ్లారు.